ప్రజాభవన్ వద్ద మంగళవారం ఆందోళన చేస్తున్న డీఎస్సీ-2008 బాధిత అభ్యర్థులు

రేవంతన్నా.. న్యాయం చేయన్నా!

- డీఎస్సీ-2008 బాధితుల విజ్ఞప్తి
- ప్రజాభవన్‌కు తరలివచ్చిన 500 మంది బాధితులు
- ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వానికి ఇటీవల సూచించిన హైకోర్టు
- కోర్టు ఆదేశాలను అమలు చేయాలని కోరుతున్న బాధితులు
- స్పష్టమైన హామీ ఇచ్చేవరకు కదలబోమని బైఠాయింపు

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు తమకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని డీఎస్సీ-2008 బాధిత అభ్యర్థులు మంగళవారం ప్రజాభవన్‌లో ఆందోళనకు దిగారు. స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఇక్కడి నుంచి కదలబోమంటూ 500 మంది అభ్యర్థులు అక్కడే భీష్మించుకూర్చున్నారు. 2008 డీఎస్సీలో నష్టపోయిన మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని గత నెల 8న రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వానికి సూచించిందని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ గోడును వెల్లబోసుకున్నారు. కోర్టు తీర్పును అమలుచేసి, తమ నియామక ప్రక్రియ జరపాలని విజ్ఞప్తి చేశారు. అధికారం చేపట్టిన మూడు నెలల్లోపే 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తమ 15 ఏండ్ల కన్నీళ్లు తుడవాలని కోరారు. ఏపీలో దాదాపు రెండున్నర సంవత్సరాల క్రితం డీఎస్సీ-2008 బాధితులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చారని.. స్వరాష్ట్రంలో తమకేం శిక్ష అంటూ వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి కల్పించుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేస్తామని విద్యాశాఖాధికారి బుర్రా వెంకటేశం హామీ ఇవ్వడంతో అభ్యర్థులు శాంతించారు.

జీవో-3 మహిళలకు అనుకూలమే

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): మహిళలకు సమాంతర రిజర్వేషన్ల అమలుతో ఉద్యోగ నియామకాల్లో మహిళలకు అన్యాయం జరుగుతుందన్న వాదనలను ప్రభుత్వం తోసిపుచ్చింది. ఈ వాదన సరికాదని పేర్కొన్నది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమశాఖ మంగళవారం పత్రిక ప్రకటనను విడుదల చేసింది. ఉద్యోగ నియామకాల్లో మహిళలకు సమాంతర రిజర్వేషన్లు కల్పిస్తూ జారీచేసిన జీవో-3తో వారికి ఎలాంటి అన్యాయం జరగదని ప్రభుత్వం స్పష్టంచేసింది. రాజేశ్‌కుమార్ దరియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు.. రాష్ట్ర హైకోర్టు తీర్పుననుసరించి మహిళలు, పురుషులకు రిజర్వేషన్ల ప్రకారం సమానవాటా దక్కేలా జీవోను జారీచేశామని వెల్లడించింది. సర్వోన్నత న్యాయస్థానం, హైకోర్టు ఉత్తర్వులను ప్రభుత్వం నిశితంగా పరిశీలించి నిర్ణయం తీసుకుని తుది ఉత్తర్వులు జారీచేశామని తెలిసింది.

విద్యార్థుల చావులకు రేవంతే కారణం

- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పిట్టల్లా రాలుతున్న విద్యార్థులు
- విద్యాశాఖకు రాష్ట్రంలో మంత్రి లేకపోవడం విచారకరం
- బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని మరోమారు తేలిపోయింది
- కేసీఆర్‌పై ఏడ్వటం తప్ప రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదు
- మార్పు అంటే ఇదేనా?
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజం

తిప్పారం తండాలో వెంకట్ కుటుంబసభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కామారెడ్డి, మార్చి 5: రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న విద్యార్థుల చావులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థత, పట్టింపులేని తనమే కారణమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థుల చావులు చూశామని, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనే చూస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. భువనగిరిలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలు నిరసన తెలిపితే వారిని అరెస్టు చేస్తారా? మార్పు అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. మూడు నెలల్లో 15 మంది పిల్లలు చనిపోతే కనీసం పట్టించుకోలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని విమర్శించారు. బోధన్‌లోని బీసీ హాస్టల్‌లో తోటి విద్యార్థుల చేతిలో హత్యకు గురైన కామారెడ్డి జిల్లా గాంధారి మండలం తిప్పారంతండాకు చెందిన డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి హరియాల వెంకట్ కుటుంబసభ్యులను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి కవిత మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. వెంకట్ తల్లికి పెన్షన్, సోదరుడికి ఉద్యోగం, రూ.15 లక్షలు, డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆమె కామారెడ్డి శివారులోని పొందుర్తిలో మీడియాతో మాట్లాడుతూ.. ఒక చిన్న విషయానికి విద్యార్థి చనిపోవడం, మరో ఏడుగురు విద్యార్థులపై హత్య కేసు నమోదుచేయడం దారుణమని పేర్కొన్నారు. హాస్టల్‌లో వార్డెన్, వాచ్‌మన్ లేకపోవడం వల్ల ఈ సంఘటన జరిగిందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత, పట్టింపులేని చర్యల వల్లనే ఎనిమిది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని ఆవేదన వ్యక్తంచేశారు. చిన్నపిల్లల జీవితాలతో ఆడుకోవద్దని విజ్ఞప్తి చేశారు. పిల్లలు పిట్టల్లా రాలిపోతుంటే రాజకీయం చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్‌పై ఏడ్వడం తప్ప తెలంగాణకు రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదని మండిపడ్డారు. తన వద్దే విద్యాశాఖను ఉంచుకున్న రేవంత్.. పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నా ఒక్కసారైనా సమీక్షించలేదని మండిపడ్డారు. విద్యార్థుల వరుస ఆత్మహత్యలు జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే

ఆదిలాబాద్ సభలో మోదీని పెద్దన్న అనడంతో రేవంత్‌రెడ్డి నిజస్వరూపం బయటపడిందని కవిత దుయ్యబట్టారు. బీజేపీ, కాంగ్రెస్ మూమ్మాటికీ ఒక్కటేనని, ప్రాంతీయ పార్టీలు ఉండొద్దనేది ఆ రెండు పార్టీల లక్ష్యమని తెలిపారు. రేవంత్‌రెడ్డి ఆరెస్సెస్ మూలాలు ఉన్న వ్యక్తి కాబట్టి మోదీని పెద్దన్న అన్నాడని పేర్కొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను ఆపిందే కాంగ్రెస్

ఉచితంగానే భూముల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) చేయాలని కవిత డిమాండ్ చేశారు. లేకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో 'నో ఎల్ఆర్ఎస్-నో కాంగ్రెస్' అనే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో ఎల్ఆర్ఎస్‌ను అమలుచేస్తామంటే కోర్టుకు వెళ్లి ఆపింది కాంగ్రెస్ నాయకులేనని మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజిబుద్దీన్, నేతలు నిట్టు వేణుగోపాల్, జూకంటి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు ఎస్సెస్సీ హాల్ టికెట్ల విడుదల

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): పదోతరగతి వార్షిక పరీక్షల హాల్‌టికెట్లు గురువారం విడుదల కానున్నాయి. విద్యార్థుల హాల్‌టికెట్లను అధికారులు రేపు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ఈ నెల 18 నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటికే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎస్సెస్సీ బోర్డు అధికారులు ముద్రిత హాల్‌టికెట్లను జిల్లాలకు పంపించారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో పరీక్షలు రాసేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు సూచించిన దరిమిలా వీటిని సైతం విద్యార్థులు వినియోగించుకోవచ్చు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయగా 5,08 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

ఇంటర్ పరీక్షల్లో 19 మాల్‌ప్రాక్టీస్ కేసులు

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంగళవారం ఒకే రోజు 19 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 12 మంది విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ దొరికారు. ఇక నిజామాబాద్, ఖమ్మం, నాగర్‌కర్నూల్, నల్లగొండల్లో ఒకరు చొప్పున విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా అధికారులు గుర్తించి పట్టుకున్నారు. మంగళవారం సెకండియర్ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్-2ఏ, వృక్షశాస్త్రం (బోటనీ), పొలిటికల్ సైన్స్ పేపర్-2లకు పరీక్షలను నిర్వహించారు. మొత్తం 4,68,531 మంది విద్యార్థులకుగాను 4,54,323 మంది పరీక్షకు హాజరయ్యారు. 14,208 (3.03 శాతం) విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. పరిశీలకులు నిర్మల్, మహబూబాబాద్, ఖమ్మం, నల్లగొండ, నాగర్‌కర్నూల్, హైదరాబాద్ జిల్లాల్లోని పరీక్షాకేంద్రాలను తనిఖీచేసినట్టు ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు.

టీ శాట్ సీఈవోగా బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): ప్రముఖ జర్నలిస్టు బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి టీ శాట్ నూతన సీఈవోగా నియమితులయ్యారు. ఈ మేరకు ఐటీశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ మంగళవారం జీవో-5ను విడుదల చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం కొరటికల్‌కు చెందిన వేణుగోపాల్‌రెడ్డి తెలంగాణ వర్సిటీలో ఎంఏ మాస్ కమ్యూనికేషన్ పూర్తిచేశా రు. జర్నలిజంలో 17 ఏండ్ల అనుభవమున్న ఆయన పాత్రికేయ రంగంలో ఉంటూనే మూడేండ్లుగా తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

పీఎం శ్రీ పథకంలో మరో 251 స్కూళ్లు

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ బడులను ఆదర్శంగా తయారుచేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా స్కూల్స్ (పీఎం శ్రీ) పథకానికి రాష్ట్రం నుంచి మరో 251 సర్కారు స్కూళ్లు ఎంపికయ్యాయి. ఎంపికైనవాటిలో ప్రాథమిక పాఠశాలలకు రూ.కోటి, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.కోటిన్నర, ఉన్నత పాఠశాలలకు రూ.రెండు కోట్లు చొప్పున నిధులను ఖర్చు చేస్తారు. ఈ విద్యాసంవత్సరంలో పీఎం శ్రీ పథకం కింద 543 స్కూళ్లు ఎంపిక కాగా, వచ్చే విద్యాసంవత్సరానికి 251 స్కూళ్లను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రతిపాదించారు. ఇటీవలే నిర్వహించిన ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు సమావేశంలో రాష్ట్రం ప్రతిపాదించగా, ఈ 251 స్కూళ్ల అభివృద్ధికి కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ పథకంలో భాగంగా బడులను పూర్తిగా హరిత పాఠశాలలుగా అభివృద్ధి చేస్తారు. వీటిల్లో సోలార్ ప్యానళ్లు, ఎల్ఈడీ లైట్లు, ప్లాస్టిక్ రహిత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, పోషకాహార తోటల పెంపకం, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతారు.

ఐసెట్-2024 నోటిఫికేషన్ విడుదల

- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

హనుమకొండ చౌరస్తా, మార్చి 5: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ 2024 విద్యా సంవత్సరంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న టీఎస్ఐసెట్-2024 నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు వైస్ చాన్సలర్, టీఎస్ఐసెట్-24 చైర్మన్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్ నరసింహాచారి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీ మల్లారెడ్డితో కలిసి కాకతీయ యూనివర్సిటీలో విడుదల చేశారు. ఐసెట్ కోసం విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో 7వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీలోపు సమర్పించవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.550, ఇతరులు రూ.750 రుసుము చెల్లించి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. రూ.250 అపరాధ రుసుముతో మే 17 వరకు, రూ.500 అపరాధ రుసుముతో మే 27వ తేదీ వరకు గడువు ఉందని వివరించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులో ఏమైనా తప్పులు, పొరపాట్లు ఉంటే మే 17వ తేదీ నుంచి 20 తేదీ మధ్య మార్పులు చేసుకోవచ్చని సూచించారు. మే 28వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌లో ఉంటుందని, జూన్ 4న 2 సెషన్లు, 5న ఒక సెషన్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. జూన్ 15న ప్రాథమిక కీ, జూన్ 16 నుంచి 19 మధ్య అభ్యంతరాల స్వీకరణ, చివరి కీ ఫలితాలను జూన్ 28న విడుదల చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పూర్వపు కన్వీనర్ ప్రొఫెసర్ పీ వరలక్ష్మి, కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్, డీన్ ప్రొఫెసర్ పీ అమరవేణి, పాఠ్యప్రణాళిక అధ్యక్షుడు ప్రొఫెసర్ రాజేందర్, ప్రొఫెసర్ ఎం సదానందం, డాక్టర్ సీహెచ్ రాధిక పాల్గొన్నారు.

కృత్తివెంటి శ్రీనివాసరావుకు గౌరవ డాక్టరేట్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాస్‌రావుకు ప్రతిష్టాత్మక డీ లీట్ లభించింది. ఛత్తీస్‌గఢ్‌లోని షహీద్ మహేంద్ర కర్మ వర్సిటీ (బస్తర్) గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. భారతీయ భాషా సాహిత్యానికి విశేష కృషి చేసినందుకు, కేంద్ర సాహిత్య అకాడమీని అభివృద్ధి పథంలో నడిపినందుకు పరిపాలనాదక్షతకు గుర్తింపుగా శ్రీనివాస్‌రావుకు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించారు. మంగళవారం ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా ఆయన గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు.

డీఎస్సీ దరఖాస్తుల్లో ఎడిట్ ఆప్షన్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ దరఖాస్తులను ఎడిట్ చేసుకునే అవకాశాన్ని విద్యాశాఖ కల్పించింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తులను సవరించుకునే అవకాశాన్నిచ్చింది. గతంలో తమ సొంత జిల్లాల్లో పోస్టులు లేకపోవడంతో చాలా మంది ఇతర జిల్లాల్లో ఓపెన్ కోటా ఉద్యోగాల కోసం దరఖాస్తులు సమర్పించారు. తాజాగా 11 వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించడంతో కొన్ని జిల్లాల్లో పోస్టుల సంఖ్య పెరిగింది. వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తే ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నట్టుగా చూపిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని అభ్యర్థులు కోరగా, విద్యాశాఖ ఈ అవకాశాన్నిస్తూ వెబ్‌సైట్‌లో మార్పులు చేసింది. ఈ అవకాశం హర్షదాయకమని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

మూడు నుంచి నాలుగేండ్ల డిగ్రీకి మారొచ్చు: యూజీసీ

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): మూడేండ్ల డిగ్రీ కోర్సుల్లోని విద్యార్థులు ఆసక్తి ఉంటే నాలుగేండ్ల డిగ్రీ కోర్సులోకి మారే అవకాశాన్ని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కల్పించింది. చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్)లో మూడేండ్ల డిగ్రీ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులు ఇందుకు అర్హులని యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీశ్‌కుమార్ వెల్లడించారు. ఆయా విద్యార్థులు తమ వర్సిటీ నుంచి బ్రిడ్జి కోర్సులను పూర్తిచేయాల్సి ఉంటుందని తెలిపారు. దేశంలో 200లకు పైగా విశ్వవిద్యాలయాలు నాలుగేండ్ల డిగ్రీ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నాయి. యూజీ కోర్సుల్లోని వారు నాలుగేండ్ల డిగ్రీని పూర్తిచేస్తే వారిని ఆనర్స్ డిగ్రీని జారీచేస్తారు. ఈ సమయంలో విద్యార్థులు రీసెర్చ్ ప్రాజెక్ట్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది.

యూవోహెచ్, మనులకు క్యాటగిరీ-2 అటానమీ

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రెండు సెంట్రల్ యూనివర్సిటీలకు క్యాటగిరీ-2 గ్రేడెడ్ అటానమీని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మంజూరు చేసింది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూవోహెచ్), మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను)లకు ఈ అటానమీని వర్తింపజేస్తూ యూజీసీ ఉత్తర్వులిచ్చింది. మూడేండ్ల క్రితం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూవోహెచ్) కేటగిరీ-1 అటానమీ ఉండగా, తాజాగా క్యాటగిరీ-2 అటానమీని దక్కించుకున్నది.

వ్యాఖ్యలు వాపస్

మొదటిపేజీ తరువాయి...

పదాలను కొందరు తమ స్వార్థం కోసం వాడుకొనే ప్రయత్నం చేస్తున్నారని, ఓ సామాజికవర్గాన్ని కించపరిచి లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలిపారు. మాట్లాడిన సందర్భం వేరే అయితే.. తనను రాజకీయంగా అస్థిరపర్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తన వ్యాఖ్యలు సామాజికవర్గానికి బాధ కలిగిస్తే భేషరతుగా వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించారు. రాజకీయం తన జీవితం కాదని.. సామాజిక సేవ బాధ్యతగా పని చేస్తున్నానని తెలిపారు.

సిరిసిల్ల నేతన్నచౌక్‌లో దిష్టిబొమ్మ దహనం

'ఎంతమంది పాపడాలు, నిరోధ్‌లు అమ్ముతున్నరు' అంటూ పద్మశాలీలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై నేతన్నలు ఆగ్రహించారు. ఈ మేరకు సిరిసిల్ల పట్టణ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని నేతన్నచౌక్‌లో కేకే మహేందర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. 'నిరోధ్‌ల మహేందర్‌రెడ్డి' అంటూ నినదించారు. అనంతరం గుండ్లపల్లి పూర్ణచందర్, బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్, మున్సిపల్ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్ మాట్లాడారు. పద్మశాలి సామాజికవర్గంపై కేకే మహేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. నేతన్న విగ్రహం సాక్షిగా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన రోజున సిరిసిల్ల బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాజుల బాలయ్య, అన్నారం శ్రీనివాస్, దార్ల సందీప్, వేముల రవి, దూస వినయ్, ప్రకాశ్, శంకర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనల ఎఫెక్ట్.. సీఎం పర్యటన రద్దు

కేకే మహేందర్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ.. జిల్లావ్యాప్తంగా పద్మశాలీల నిరసనలతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేపట్టనున్న పర్యటన రద్దయింది. ఈ నెల 7న వేములవాడ రాజన్న దర్శనంతోపాటు సిరిసిల్లలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండగా.. కాంగ్రెస్ నాయకులు నేతన్నలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపడంతో సీఎం పర్యటన రద్దు చేసుకున్నట్టు తెలిసింది. సిరిసిల్లలో ఇప్పటికే నేతన్నలు కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మలు దహనం చేయడంతోపాటు రేవంత్‌రెడ్డి పర్యటనను కూడా అడ్డుకుంటామన్న హెచ్చరికలు జారీ చేశారు. రాజన్న సన్నిధిలో మహాశివరాత్రి జాతర ఉన్నందున భక్తులకు ఇబ్బంది కలుగొద్దన్న ఉద్దేశంతోనే పర్యటన రద్దు చేసుకున్నట్టు కాంగ్రెస్ నాయకులు చెప్తున్నారు. మొదటిసారిగా ముఖ్యమంత్రి హోదాలో మహా శివరాత్రి సందర్భంగా రాజన్నకు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తారని ఆర్భాటం చేసిన నాయకులు, కార్యకర్తలు.. ఇప్పుడేమో భక్తుల ఇబ్బందిని సాకుగా చూపుతున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నేతన్నల సమస్యలు పరిష్కరించాలి

- సిరిసిల్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

కలెక్టరేట్, మార్చి 5: కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నల సమస్యలు పరిష్కరించాలని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించి వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని నేతన్నలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్లలోని కొత్త బస్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నేత కార్మికులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ.. ఈ నెల 7న సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటనకు వస్తున్న సందర్భంగా వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని కోరారు. బతుకమ్మ చీరలు, ప్రభుత్వరంగ సంస్థల వస్త్రాలన్నింటికీ ఆర్డర్లు తమకే ఇవ్వాలని, వర్కర్ టూ ఓనర్ పథకాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేనేత జౌళి శాఖ ఆఫీస్ ఎదుట ఉదయం 10 గంటలకు ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. అన్ని రంగాల కార్మికులు, ఆసాములు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలివ్వాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

వంగపల్లి శ్రీనివాస్

వెల్దుర్తి, మార్చి 5: పార్మిశుధ్య కార్మికులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మాసాయిపేటలో టీఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగులకు మొదటి తేదీ నుంచి వేతనాలు చెల్లిస్తున్న ప్రభుత్వం.. పంచాయతీ కార్మికులను మాత్రం చిన్నచూపు చూస్తున్నదని విమర్శించారు. అరకొర వేతనాలతో బతుకులు వెళ్లదీస్తున్న పంచాయతీ కార్మికులకు వేతనాలు ఆలస్యం అయితే కుటుంబాలు గడవడం కష్టమవుతుందని తెలిపారు. సమావేశంలో యువసేన రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణ, హరిప్రసాద్, భిక్షపతి, లింగం, స్వామి తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ ఇ-టెండరు ప్రకటన నెం.లు C/E.29/Elec/M/SC/54/OEW/OT/2023-24 తేది: 01.03.2024

భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారు దిగువ ఇచ్చిన పని కొరకు **22-03-2024న 15.00 గంటల** వరకు ఇ-టెండరు కోరుచున్నారు.

1. ఇ-టెండరు నెం.: ఇ-టెండరు నెం. C/E.29/Elec/M/SC/54/OEW/OT/2023-24. ఇ-టెండరు నెం. E-M-SC-54-OT-2023-24. **పని పేరు:** షెడ్యూల్-ఎ-సబ్-స్టేషన్ల వద్ద 4 పోల్ స్ట్రక్చర్స్ స్థానంలో RMUలు ఏర్పాటు చేయుట. షెడ్యూల్-బి-సర్వీసు భవనాలు/కాలనీలు మొ|| వాటితోపాటు UG కేబుల్స్‌తో OH లైన్స్ యొక్క స్థాయి పెంపుదల. షెడ్యూల్-సి-BLDC ఫ్యాన్లతో కన్వెన్షనల్ సీలింగ్ ఫ్యాన్ల యొక్క స్థాయి పెంపుదల. షెడ్యూల్-డి-లోడ్ సెంటర్ల వద్ద ఆటోమేటిక్ పవర్ కరెక్షన్ ప్యానెల్స్ ఏర్పాటు. షెడ్యూల్-ఇ-కంట్రోల్ ప్యానెల్స్‌తోపాటు కాలంచెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లు, LT/HT స్విచ్‌గేర్స్ యొక్క స్థాయి పెంపుదల. షెడ్యూల్-ఎఫ్-ఎనర్జీ ఎఫిషియెంట్ పంపులతో కన్వెన్షనల్ పంపుల స్థాయి పెంపుదల-విద్యుత్ సౌకర్యాలు. **టెండరు విలువ:** (రూ.) 6,16,29,833.64. **బయానా:** (రూ.) 4,58,200.00. **CTF:** (రూ.) 0.00. **పూర్తిచేయు కాలం:** 6 నెలలు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, (M)/సికింద్రాబాద్.

A0271

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.